తీరని కోరిక

శ్రీ ఆమంచర్ల మల్లికార్జునరావు

సిటీలో ఆ వీధి చాలా జనసమర్ధమైంది. ఆ వీధి మొగలోవున్న కిళ్ళీకొట్టువద్ద కారాపి, ఇవతలకువచ్చి కొట్టులో సిగిరెట్ ప్యాకెట్ కొంటున్న శేఖర్‌కు ఆమె కనుపించింది. ఆమె అప్పుడేవచ్చి వెళ్ళిన బస్సునుండిదిగి తిన్నగా ఎదురుసందులోనికి మలుపుతిరిగి వెడుతూంటే అతను వెళ్ళి ఎదురుగా నిలిచాడు. శేఖర్ని చూచి ఆమె "అరే! మీరా?" అని ఆశ్చర్యపడుతూ నిలబడిపోయింది.

"నీవా" అన్నాడు అతను.

కొంచంసేపు మౌనంగా యిద్దరు గడిపినా మౌనాన్ని తొలగిస్తూ కడకు అతనే ప్రసంగాన్ని మొదలు పెట్టాడు.

"మళ్ళీ చాలా దినాలకు కలుసుకున్నాం గాయిత్రి! అన్నాడు శేఖర్.

"ఎప్పుడో ఒకప్పుడు ఈ జీవితంలో మళ్ళీ కలుసుకోక తప్పదులెండి" అంది ఆమె.

అతని చూపులు ఎదుటివ్యక్తిపై ప్రసారించబడి, ఎదుటి వ్యక్తిని పరీక్షించాయి - ఆమె వేసుకొన్న దుస్తులను పరీక్షగా చూచాడు - ఆమె తెల్లటిచీర ధరించివుండి ఒకేవక జతగాజులు చేతికివేసుకొనివుంది. చంకలో ఎక్సర్‌సైజ్ నోట్‌బుక్సు కట్టొకటి, చేతిలో ప్రైమరి హిస్టరీ టెక్స్టుబుక్ వుంది. ఆమె అందచందాలు, ఉత్సాహం, ఆమెలో లోపించినట్లు ఆమె ముఖవర్చస్సు తెలుపుతున్నాది. పూర్వపు పోలిక లేమాత్రం ఆ వ్యక్తిలో లేవని, పోలికకట్టడం కష్టమని ఊహించాడు శేఖర్.

అతని చూపులకు ప్రత్యామ్నాయంగా గాయిత్రి అతని హోదాను యిట్టె ఒక క్షణంలో గ్రహించింది. అతను విలువైన సూటూ, బూటుతో వుండడమే గాక, చేతికి రెండు వుంగరాలు ధరించి వుండడం గమనించింది. ఆ వుంగరాలలో ఒకటి ఎరుపు, మరియొకటి నీలం. అతనికొరకై ఎదురు చూస్తున్న కారునుకూడా చూచింది.

మళ్ళీ అతనే ప్రశ్నించాడు.

"ఇలా ఎక్కడి కెడుతున్నావు? ఈ సరంజాం ఏమిటి అన్నాడు శేఖర్.

"స్కూలికి! యిక్కడికి దాపులోవున్న శారదా గర్ల్స్ స్కూలికి. పిల్లలికి చదువుచెబుతూ టీచర్‌గా వున్నా! మరి నీవీలా ఎక్కడనుంచి? ఎక్కడ ఆఫీసరుగా వున్నావు" అని ఏక వచన ప్రయోగంతో అంది గాయిత్రి.

"అలాంటిదేమిలేదు. ఇన్స్యూరెన్సు ఆఫీసులో వున్నాను. మనకు పెద్ద హోదాగల వుద్యోగాలెలా వస్తాయి" అన్నాడు.

"మనకంటారే! మీకేం మంచి ఆఫీసర్‌గా వున్నావనుకొంటాను" అంది గాయిత్రి.

"అదిలేదు! ఏదో యింత హోదాగల కొంచం పెద్దది అంత మాత్రం" అన్నాడు శేఖర్.

కొంచంసేపు ఆగి ఆలోచించి, వున్నట్లుండి అడిగింది గాయిత్రి. "మీరు వివాహం చేసుకొన్నారటగా? ఆమె మాటలు అతనిలో తొట్రుపాటు కలిగించాయి. తొట్రుపాటును కప్పిపుచ్చుకొంటూ చిరునవ్వునవ్వి "ఛా! అంతా అబద్ధమే! అందులో ఒక్క అక్షరమైన నిజంలేదు. పెండ్లిచేసుకోడానికి తీరికేది" అన్నాడు. అతను ఆమె ముందు నిలిచి చెప్పిన ఆ మాటల్లో అక్షరమైనా నిజమైందికాదు. ఆమె అడిగిన ప్రతి విషయంలో అతను ఓటమినొందాడు.

"నేను అలాగని విన్నానులెండి" అంది గాయిత్రి.

"నేనూ విన్నాను! నిన్నుగూర్చి; నీవు వివాహం చేసుకొన్నావని. కాని ఇప్పుడు నిన్నుచూస్తే నిజం తెలుస్తున్నాది" అన్నాడు శేఖర్.

"దానికేంలేండి! యీలాంటి మాటలు ఎన్ని వినుంటానో. ఇక క్షమించండి. ఇక నేను వెళ్తాను! నమస్కారం" అని శేఖర్‌కు నమస్కరించి అక్కడినుంచి వెళ్లిపోడానికి ఉద్యుక్తురాలైంది. శేఖర్ ఆశ్చర్యపడుతూ ఆమె దారికి అడ్డుగా తన చెయ్యిజాపి అడ్డుపెట్టి "కనుపించక, కనుపించక అగుపించావు. సావకాశంగా అన్ని విషయాలు మాట్లాడక, తుర్రున పారిపోతే ఏలా! పద! కనుపించే హోటల్లో కూర్చుని చల్లగా కబుర్లు చెప్పుకొందాము" అన్నాడు శేఖర్.

"అలాగయితే స్కూలికి లేట్ అవుతుందే-యిప్పటికే బెల్ అయివుంటుంది" అంది ఆమె.

"అందులో వచ్చే ప్రమాదమేమీలేదు - ఈ రోజుకు స్కూలుకు లీవు పెట్టు. సరిపోతుంది" అన్నాడు.

ఆమెకు అతని మాటలు నచ్చలేదు! అందుకు అంగీకరించలేదు. దానికి కారణం ఆ రోజు స్కూల్లో జీతాలిచ్చేరోజు - పర్వదినం - వచ్చే నాలుగురాళ్లు చేతుల్లోపడేరోజు. ఆ విషయం చెప్పి, అందుకొరకు అతన్ని అడుక్కొని తప్పించుకోవడం ఆమెకు ఇష్టంలేకపోయింది.

"శేఖర్‌గారు! ఇలా నడిరోడ్డుమీద నిలబడి మాట్లాడుకోవడం సభ్యతగాదు. రేపు సాయంత్రం మా యింటికిరండి! సావధానంగా మాట్లాడుకోవచ్చు" అంది గాయిత్రి.

"నీవు చెప్పిందే బాగుంది" అని ఆమోదించాడు శేఖర్.

చిన్న తెల్లకాగితంపై తన అడ్రస్ వ్రాసియిచ్చి "మీరు రేపురండి! మీరు బస్సు నెం ... "అని ఏవిధంగా రావలసింది చెప్పబోయేసరికి.

"సరే, సరే! యిక వివరించనక్కరలేదులే" అన్నాడు అతను.

శేఖర్‌వద్ద శలవుతీసుకొని స్కూలువైపు వడివడిగా నడిచివెళ్ళిపోయింది ఆమె.

ఆ వెళ్ళిన దిక్కునేచూస్తూ వుండిపోయాడు శేఖర్, దూడని లాక్కుపోతుంటే చూచేగోవులాగా.

కార్ని కేకేసి, అందులో ఆఫీసు చేరుకున్నాడు.

ఆ వూర్లో మంచి పలుకుబడివుంది, ఆఫీసర్ హోదాలో జీవిస్తున్నవాడే శేఖర్. కారు, హోదా కలిగివున్నా, తనకు వున్నవని తెలిపితే గాయిత్రి హృదయానికి నొప్పి కలిగించినవాడ నవుతానని ఆలోచించి ఆమె ముందు ప్రతి విషయంలో భొంకాడు. కాని అన్నింటిలో ఓడిపోయాడు.

ఆఫీసుకువచ్చి తన సీటులో కూర్చున్న శేఖర్‌కు తన కిటికీగుండా కనుపించే ఎర్రగోడల, మింటినంటే భవనాన్ని చూసేసరికి యెనిమిదేళ్లక్రితం జరిగిన సంఘటనలు మెదడులో మెదిలాయి.

◆ ◆ ◆

అది యెనిమిది సంవత్సరాల క్రిందటిమాట. అప్పటికి శేఖర్ కాలేజి చదువుతున్న దినాలు - వాళ్ళ నాన్న అక్కడే పెద్ద ఉద్యోగం చేస్తుండేవాడు. శేఖర్ మంచి రూపసి - సహజంగా పుట్టుకతోనే వచ్చింది. కాని మనిషికి ఏదో అవలక్షణం వుంటుందనే సిద్ధాంతానికి ఋజువుగా అతనికి పుట్టుకతోనే పిరికితనమొచ్చింది. ఆ పిరికితనం యిక తగ్గనేలేదు.

ఆ రోజు శేఖర్‌వాళ్ళింటికి, వాళ్ళ పెద్దమ్మ కుమారుడొచ్చాడు. అతనూ అక్కడే ఉద్యోగం చేస్తున్నవాడే. అతనికి ఆ మధ్య వివాహం జరిగింది. ఆ వివాహానికి శేఖర్ వెళ్ళకపోవటం జరిగింది. శేఖర్ని వెంటబెట్టుకొని పోవాలనివచ్చి, తన వెంట తీసుకొని వాళ్ళింటికి బయలుదేరాడు. బజారులోనుంచి నడుస్తూ, అక్కడినుంచి కొంతదూరం తీసుకొనివెళ్ళి "అరే శేఖర్! యీ యింట్లోవాళ్లను తెలుసట్రా నీకు" అన్నాడు.

"చాలా బాగుంది! ఈ పట్టణంలోవుండే వాళ్లందర్ని తెలుసుకోడానికి ఓపికలేదురా అన్నా" అన్నాడు శేఖర్.

"అదిగాదురా! వాళ్లు మీ వదినకు చాలా దగ్గర బంధువులు - వరసకు పెద్దనాన్న అవుతాడు.

ఈ గృహస్థుడు" అన్నాడు వాళ్ళన్న.

ఎర్రటి రంగపూత వేయబడి, ముందు మంచి గార్డన్ వుండే ఆ మేడను ప్రతినిత్యం చూచేదే. అంత వరకు ఫలానివారిదనిమట్టుకు తెలియదు శేఖరికి.

శేఖర్ వద్దంటున్నా, బలవంతంగా ఆ యింట్లోకి దారితీసాడు శేఖర్ అన్న. స్వతహాగా శేఖర్ పిరికి-అందులో పదిమంది నూతనులు ముందు కూర్చుని మాట్లాడానికి ఆడవాళ్లకన్నా హైరానాపడతాడు.

యిద్దరూ ఇంట్లోకి ప్రవేసించేసరికి ఆ కుటుంబం సావధానంగా కుర్చీలో కూర్చుని అప్పుడే టీ తీసుకొంటున్నారు. శేఖర్ అన్ననుచూచి ఆ యింటి యిల్లాలు 'రావోయి! అల్లుడూ' అని ఆహ్వానించింది.

వెళ్లి ఆసనం ఆక్రమించి కూర్చున్న శేఖర్ దృష్టి నలువైపులా ప్రసరించింది. మంచి మర్యాద కుటుంబీకులలోవుండే లక్షణాలు కనుపించాయి. అతని చూపులు ఒక ప్రదేశానికి వచ్చేసరికి - అలాగే ఆగిపోయాయి - కంటికి ఎదురుగావుండే వ్యక్తిపై నిలిచిపోయాయి. తానావిధంగా చూడకూడదని అతనికి తోచలేదు - అతనికి ఆమె కనుపించింది. చేతిలోనికి టీ, సాసర్ తీసుకొని అప్పుడే టీ చప్పరిస్తూ, వచ్చిన వారికేసి చూస్తూవుండే ఆమె కనుపించింది.

ఆమె అందం, చందం, కట్టు బొట్టు అతన్ని అట్టే ఆకర్షించింది. మంచి వాయిల్ చీరకుతగ్గ జాకెట్, రెండు జడలు, ఒకచేతికి వాచీతో, రతీదేవిలా కూర్చునివుంది ఆమె.

గుటకలువేస్తూ కన్నార్పక చూస్తూ వుండిపోయాడు శేఖర్.

శేఖర్ని ఆ ఇంటి యజమానికి పరిచయం చేసాడు వాళ్లన్న.

"ఓహో! రామారావు కుమారుడా? చాలా సంతోషం" అన్నాడు ముక్తసరిగా ఆయన. ఆయన స్వభావం వెయ్యి మాటలు మాట్లాడినా, ముక్తసరిగా మూడు మాటలు మాట్లాడడం. ఇంటి యిల్లాలు మట్టుకు "అమ్మాయి గాయిత్రి! లోపలికి వెళ్ళి బావలకు టీ తీసుకొచ్చి ఇవ్వమ్మా" అంది కుర్చీలో రతీదేవిలాగా కూర్చున్న ఆమెనుద్దేశిస్తూ.

వయ్యారంగాలేచి, గాయిత్రి లోపలికివెళ్ళి రెండు కప్పుల్తో టీ తెచ్చిపెట్టింది.

ఈ నవనాగరకత ప్రపంచంలో ఎంత నాగరకత పెరిగినా ఎవరి అలవాట్లు వాళ్ళవి. కాలేజీ చదువుతున్న శేఖరికి కాఫీ, టీ మొదలైనవి అలవాటు లేదంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

శేఖర్ మట్టుకు తెచ్చిపెట్టిన టీ పుచ్చుకోక మిన్నకుండా కూర్చున్నాడు.

"ఏంనాయనా! టీ తీసుకోలేదే" అంది యింటి యిల్లాలు లక్ష్మమ్మ.

"వాళ్ల నాన్నగారి వుత్తరువేమో! యీ లాంటివి తీసుకోగూడదని పాపం" అంటూ అదో మాదిరిగా అంది గాయిత్రి. ఆమె మాటలకు అందరూ నవ్వుకున్నారు. గాయిత్రి హేళన చేసిందనే ఉక్రోషం కొద్దీ యిష్టంలేకున్నా పౌరుషంకొద్దీ శేఖర్ చప్పున టీ కప్పు తీసుకొని ఒక్క గుటక మింగాడు. ఇంకే ముంది నోరు కాస్తా కాలేసరికి చేతిలోని కప్పు సాసర్ విడిచేసాడు. అది కాస్తా గచ్చుపైపడి తుత్తునియలైపోయింది. ఆ దృశ్యం చూసిన గాయిత్రికి ఎంత ప్రయత్నించినా నవ్వు ఆపలేకుండా వచ్చింది. నోటికి పమిటచెంగు అడ్డుపెట్టుకొని రూంలోనికి పరుగెత్తింది. రూం కర్టన్ వెనుక పకపకలు అక్కడవారికి వినిపిస్తూనే వున్నాయి.

లక్ష్మమ్మ నొచ్చుకుంటూ "జరిగిపోయింది పోనీలే! గాయిత్రి యిలారా! నవ్వు చాలించి కప్పుతో పాలు తెచ్చిపెట్టు" అని మందలించింది ఆమె కుమార్తెను.

"చిన్నపిల్ల ఏంతెలియదు" - బొత్తిగా వేగలేకండావున్నా దాంతో" అంటూ కుమార్తె ప్రవర్తనకు నొచ్చుకోకుండా సర్దిపుచ్చి చెప్పింది.

పదినిమిషాలు కూర్చుని శలవు తీసుకొని ఇవతల పడ్డారు యిద్దరు.

♦ ♦ ♦

శేఖర్ మళ్లీ ఆ యింటి పరిసర ప్రాంతానికి అడుగు పెట్టి ఎరుగడు. మళ్లీ వెళ్ళాలని తోచలేదు ఎప్పుడూను!

ఆ రోజు శేఖర్ కాలేజినుంచి లంచిటైంలో యింటికి తిరిగి వెడుతూంటే తోటి విద్యార్థినులతో ఎదురుగా వస్తున్న గాయిత్రి కనిపించింది. గాయిత్రి ఆగి, శేఖర్ వద్దకువచ్చి "నమస్కారం! మా ఇల్లే మరిచిపోయినట్లున్నారే! మళ్ళీ అటువైపు రాలేదేం మీరు! ఆ దినంనాటి నా ప్రవర్తనికి క్షమించండి" అని క్షమాపణ కోరింది.

"క్షమించడానికి ఏంవుందిలెండి! తీరికలేక రాలేదు" అన్నాడు శేఖర్.

"నేనూ అలాగనుకున్నానులెండి! మరి యివాళ సాయంత్రం వస్తారుకదూ! రండి" అంది ఆమె.

ఆడవాళ్ళతో మాట్లాడడం చేతగాని శేఖర్ ఆమె అడిగిన కోరికకు మనస్సులో యిష్టంలేకపోయినా నాగస్వరానికి ముగ్ధురాలైన నాగంలాగా "అలాగే వస్తానులెండి" అన్నాడు.

♦ ♦ ♦

సాయంత్రం వాళ్లింటికి వెళ్లిన శేఖర్ని గాయిత్రి నాన్న సాధారణంగా ఆహ్వానించాడు. "ఆ రోజు జరిగిన సంగతి మరిచిపో నాయనా! మేము భయపడ్డాం—మళ్ళీ ఈ యింటికి రావేమో" అని పలికాడు ఆయన.

"ఆలాంటిదేంలేదండి" అని శేఖర్ ఏదో చెప్పబోతూంటే,

"లేదునాన్నా! బావగారికి టీ జ్ఞాపకంవచ్చి, జడిసి రాకుండా మానుకున్నాడు అంతే! అంతే గదండి శేఖర్‌గారు" అంది.

చనువుగా ఆమెచేసిన హేళనకు అతను నవ్వి వూరుకున్నాడు.

"నీవేం చదువుతున్నావ్ నాయనా" అన్నాడు గాయిత్రి నాన్న.

"బి. ఏ" అన్నాడు శేఖర్,

"ఒక చిన్న కోరికవుంది-అడగమంటావా" అంది గాయిత్రి.

"అడగండి!"

"మీరు నాకు లాజిక్ ప్రయివేట్ చెప్పగలరా" అంది గాయిత్రి.

"అవున్నాయనా! అమ్మాయికి ఆ సబ్జక్టులోచాలా తక్కువ మార్కులొస్తున్నాయి - నీకు తీరిక వేళలో చెప్పు - అది నీ సబ్జక్టేగా" అన్నాడు. ముసలాయన కుమార్తె అడిగిన దానిని బలపరస్తూ.

అసలే పిరికి! అందులో ఒక యువతికి బోధనచేయమని ఆమె తండ్రి కోరడంతో శేఖర్ మరీ యిరకాటంలోపడిపోయాడు. ఆమెకు ప్రయివేట్ చెప్పడం అనేసరికి ముచ్చెమటలుపోసాయి. కాని అతనికి తెలియకుండా "ఆలాగేలెండి" అని జవాబు యీవలకు వచ్చింది.

మరుసటిదినమే ప్రయివేట్ మొదలుబెట్టి ఆమెకు శ్రద్ధగా అర్థం అయ్యేలాగా బోధించ ప్రయత్నించాడు. అతను వచ్చేసరికి గాయిత్రి శృంగారంగా అలంకరించుకొని టీ కప్పుతో రెడిగా వుండేది. మొదటి రోజుల్లో విముఖత్వంచూపినా రానురాను ఆమె చేతిమీదుగా టీ పుచ్చుకోవడానికి బద్ధుడయ్యాడు. ఆమెకూ పాఠం ఏలావున్నా చంద్రుడిలాంటి శేఖర్ తన ఎదురుగా వుండడమే ఆమె కోరిక. శేఖర్ని చూచేసరికి ఆమెలో వింత వింత ఆలోచనలు పొడసూపేవి. అతను వున్నంతవరకు అమర సుఖం అనుభవిస్తున్నట్లు భావిస్తూండేది.

యిద్దరు యువతీ యువకుల్ని స్వేచ్ఛగా వదిలితే జరిగే పరిణామం! ప్రేమ. ఆ ప్రేమే శేఖర్ గాయిత్రి విషయంలో తటస్థపడింది. కాని లోకంలో ప్రేమించి, ఆ ప్రేమను సాఫల్యంచేసుకొన్నవారు అరుదు. దానికి కాలం, కర్మం, పరిస్థితులు - అడ్డుతగులుతాయి - వాటికి దాసాను దాసులైపోతారు - కాని వాడు విజయం పొందుతాడు.

అదే జరిగింది శేఖర్ గాయిత్రీల విషయంలో - వారి ప్రణయానికి అడ్డుగోడ లేర్పడ్డాయి.

గాయిత్రి తండ్రికి అక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ గావడంతో పరిస్థితులు తలక్రిందులయ్యాయి - యిద్దరు ఆలోచించారు - స్వతంత్ర ప్రపంచంలో జంటపక్షుల్లాగా విహరిస్తూ వెళ్ళిపోదామని. కాని అంతటి సాహసం - తల్లి తండ్రులనువిడిచి, వ్యతిరేకించి పారిపోవడం పిరికితనంగల శేఖర్‌కి సాధ్యపడలేదు. ఆమె మట్టుకు వెళ్ళిపోడానికి సిద్ధమయింది. అతని పిరికితనం ఆమె ప్రేమనుగూడా కప్పిపుచ్చగలిగింది. ఒక నిశ్చయానికి రాలేకపోయాడు.

◆ ◆ ◆

అక్కడనుంచి వెళ్ళిన గాయిత్రినుండి 1 సం|| వరకు ఉత్తరాలు వచ్చాయి శేఖరికి - అంతే మరి ఆమె విషయం తరవాత తెలియలేదు శేఖరికి. అప్పటినుంచి ఆమెకై విచారించాడు కాని ఆమె ఉనికి తెలియలేదు.

◆ ◆ ◆

ఆఫీసు గోడ గడియారం సాయంత్రం 5 గంటలు కొట్టడంతో యీలోకంలో వచ్చి పడ్డాడు శేఖర్ పూర్వస్మృతులనుంచి — అతని అత్రుత గాయిత్రె లావుందనేసి సాయంత్రమే ఆమె యింటికి వెళ్ళి ఆమె అమృతహస్తం మీదుగా టీ పుచ్చుకోవాలని కోరిక కలిగింది. తను పెద్ద ఉద్యోగినని, తెలియపరచడం ఆమె మనసు కించపరచడమే అని అనుకొన్నాడు. సామాన్యంగా వుంటే ఆమెను కష్టంగలిగించని వాడనౌతానని అతని ఊహ.

ఇంటికి తిరిగి వచ్చిన శేఖర్ అదరాబదరా దుస్తులు మార్చి చాలా సింపుల్‌గా పంచె, షర్టు వేసుకొని బయలు దేరాడు. భార్య గోమతి అడిగింది "అర్జంట్ పనిపై వెడుతున్నారా! అని"

"అవును రవిని జాగ్రత్తగా చూచుకుంటూవుండు! కొంచెం లేటుగావస్తాను" అని శేఖర్ అన్నాడు

బస్సుపై ఆమె చెప్పిన వీధికి చేరి, ఆమె యింటిని కనుక్కొని వెళ్లేసరికి రాత్రి 8 గంటలు అయింది తలుపు తట్టేసరికి "ఎవరు వారు"! అంటూ గాయిత్రి తలుపు తీసింది. ఎదురుగా నిలబడిన శేఖర్ని చూచి ఆశ్చర్యపడింది.

"మీరు రేపు కదా వస్తానన్నారు?" అని ప్రశ్నించింది

"నిజమే! కాని నిన్ను కలుసుకొని వివరాలు కనుక్కోవాలనే నా అత్రుత ఇలా రాడానికి కారణం. నీ అమృత హస్తం మీదుగా టీ పుచ్చుకోవాలనే వాంఛ గాఢంగావుండి యీలారాడానికి ప్రేరేపించింది."

ఆమెనవ్వుతూ "చాలా బాగుంది. యిప్పుడు మీకు ఫలహారం తెచ్చిపెట్టడం సాధ్యంకాదు! శేఖర్ గారు! పోనీండి టీపెట్టిస్తాను" అంది. ఆ యిల్లు వుండే తీరుచూస్తే గాయిత్రి ఎటువంటి జీవనం గడుపుతుండేది ప్రతిబింబంగా పసికట్టవచ్చు. నల్లటి పొగ చారలు పారిన గోడలు, పై భాగంనుండి మట్టిపెళ్లలు, విరిగి పడుతూండి, ఒకే కిటికీతో అది కూపస్థంలా వుంది. యిల్లు అనడానికి వల్లగానిది. గది, దాన్నంటి వంటగదీ అంతే. యింట్లో సామానల్లా ఒకచాప, ఆమె స్కూలుకు వేసుకొని వెళ్లే బట్టలుజత, ఒకట్రంకు, తప్ప యింకేమి లేవు.

"గాయిత్రీ! నీ విక్కడ ఎన్నిదినాల నుంచి వున్నావు అసలీలారావడానికి కారణం" అన్నాడు శేఖర్. గాయిత్రి చెప్పిందాన్లో సారాంశం—అక్కడ నుండి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిన సంవత్సరానికే వాళ్ళమ్మ చనిపోయింది. మరుసటి సంవత్సరం తండ్రి గూడా దిగులుతో చనిపోయాడు. ఆయన పోయేసరికి వారికి మిగిలిందల్లా 10 వేల అప్పు, ఒక యిల్లు. అప్పటికే వాళ్ళన్నకు వివాహం జరిగివుండింది. అపై అతను క్షయవ్యాధికి ఆహుతి అయి 1 సం|| క్రితం స్వర్గస్థుడయ్యాడు — అతని భార్య యిద్దరి బిడ్డల పోషణ భారం గాయిత్రిపై పడింది. తండ్రి పోయేసరికి బి. ఏ చదువుతుండింది కాబట్టి అది ఎలాగో కష్టపడి పూర్తిచేసి యిక్కడికి టీచర్‌గా వచ్చింది.

"మీరు యిక్కడ వుద్యోగంలో వున్నారని నాకు తెలియదు శేఖర్ గారూ !" అంది.

మరి పదినిమషాలు మాట్లాడి వంటింటిలోనికి వెళ్ళి, 15 నిమిషాలలో 2 కప్పుల టీ తీసుకొని వచ్చింది. శేఖర్ కు ఒకటి అందించింది.

"మీకు అతిధి సత్కారాలు ఎక్కువగా చేయలేక పోయాను - క్షమించండి" అంది గాయిత్రి.

టీని ఒకసారి నోటిదగ్గర పెట్టుకొని ఒక గుటక వేసేసరికి పంచప్రాణాలు గుర్రుమన్నాయి. ఆ టీ అంత చెడ్డ వాసన వేస్తున్నది. శేఖర్ కు నిజంగా కళ్లు తిరిగిపోయాయి. నోటి వద్దపెట్టిన కప్పును దించి చేతిలో పట్టుకొని వుండిపోయాడు. అతను ఆ టీ తాగడానికి తటపాయిస్తున్నది గమనించిన గాయిత్రి మొహం వివర్ణమైంది. తల వంచేసుకుంది.

మరోసారి, ఆవిడముందు ఓడిపోయాడు; ఆ నాడు కూడా ఆలాగే వోడిపోయాడు తల ఎత్తి ఆమెను చూచేసరికి, ఆమె అప్పటికే తలవంచేసుకున్నది గమనించాడు. కాని ఈ సారిమటుకు శేఖర్ గాయిత్రిని సంతోష పెట్టడానికి ఏమైనా త్యాగం చెయ్యాలను కున్నాడు. ఆమె సంతోషమే తన సంతోషంగా భావించాడు. ఆ వాసనగా వున్నటీనే సంకోచంలేక హృదయ పూర్వకంగా సేవించాడు. గాయిత్రి కళ్ళలో కృతజ్ఞత, సంతృప్తి గోచరించింది.

♦ ♦ ♦

మానవుడు ముందు ఆలోచనలేకుండా తప్పటడుగు వేస్తాడు. మళ్ళీ అది సక్రమమైంది గాదనప్పుడు మొదటి దానికై ప్రాకులాడడం సహజం. అదే శేఖర్ కూ తటస్థించింది. ఇంటికితిరిగి వచ్చిన శేఖర్ హృదయంలో భగభగమని జ్వాలలు ప్రజ్వ లించాయి. తన పిరికితనం వల్ల గదా ఆమె అంతటి హీన జీవితం గడుపుతుండేది. యిప్పుడు వున్నంత ధైర్యం అప్పుడే వుంటే ఎంతబాగుండేది. ధైర్యం చేయలేక పోయాను. పెద్ద వుద్యోగినైవుండి, ఆమె ఆలా కడుహీనంగా జీవించడం చూచి వూరకుండడం న్యాయమా ? అని పించింది. శేఖరికి రాత్రంతా నిద్ర లేకుండా ఆలోచించినా ఒకనిర్ణయానికి రాలేక పోయాడు. మరుసటి దినం ఉదయం ఆలో చించాడు. నిజం తెల్పి, ఆమెకు తగిన సహాయం చేద్దాం అనుకొని అదే నిశ్చయానికి వచ్చాడు. శేఖర్ ఆ విషయంలోనూ ఓడిపోయాడు. అతడు ఆశించిందల్లా విఫలమైంది. అసలు గాయిత్రి విగ్ర హామే యీ విశాల ప్రపంచంలోనుంచి అంతరించి పోయింది.

శేఖర్ సాయంత్రం గాయిత్రి యింటికి వెళ్లేసరికి ఆయింటి యజమానురాలు చెప్పింది. పాముకాటువేసి గాయిత్రి ఆస్పత్రిలో చేర్చబడిందని – అపాయ స్థితిలోవుందని. ఆస్పత్రికి వెళ్ళిన శేఖరికి, గాయిత్రి అంతిమ శ్వాస తీసుకొంటుండడం కనుపించింది.

"గాయిత్రీ !" అని పలకరించి "ఓడిపోయాను గాయిత్రి ! నీముందు అన్నివిషయాలలోనూ ఓడి పోయాను. అటు నీవు, ఇటునేను సంతోషించలేక పోయాం. నిజంగా నీకు చేసిన అన్యాయం చాలా ఘోరమైంది. నీ సుఖం కోసం త్యాగం చెయ్యలేక పోయాను – పిరికిపందని - అందే ఫలాన్ని, అంది పుచ్చుకోడానికి యత్నించక – గగన కుసుమంకోసం ప్రేలాడాను. నన్ను క్షమించవూ" ! అన్నాడు శేఖర్.

"శేఖర్ బాబూ ! ఎందుకంత బేలాగా మాట్లాడు తారు. ఎవరి మొహాన ఎలావ్రాసివుంటే ఆవిధంగా జరిగి తీరుతుంది...యికనైనా పిరికితనం వదలి లక్షు ణంగా వివాహం చేసుకొని సుఖించండి. అందని పండ్లకు ఆశించకండి! శలవు !" అని హీనస్వరంతో మాట్లాడింది. ఆపాము కాటు ప్రమాదమైనందున - ఆమె తిరిగి కోలుకోలేక పోయింది – మూడు దినాలు ఎలాగో గడిపినా నాలుగవ దినం - ఆమె ప్రాణ వాయువులు అంతరించాయి – ఆ దివ్యజ్యోతి ఆరి పోయింది. ఓడిపోయిన యోధుడులాగా చూస్తూ వుండిపోయాడు - కళ్ళల్లో నీళ్లు బొటబొట కారుస్తూ- శేఖర్!